بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ   نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ   وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 29.12.2017 (TELUGU)**

**ఖాదియాన్ సభలో పాల్గొనువారు దుఆల వైపు అధిక శ్రద్ధ చూపవలెను**
**ఈ సభలో పాల్గొన్నందున తమలో ఒక విప్లవాత్మక మార్పు ఏర్పరచుకోగలరు**
**ముస్లిముల మార్గదర్శనము కొరకు దుఆ చేయగలరు, ప్రపంచ స్థితిగతుల కొరకు కూడ సాధారణంగా దుఆ చేయగలరు, వినాశన గుండము నుండి తప్పించుకొనుటకు అల్లాహ్ తఆలా మానవులకు తెలివి తేటలు ప్రసాదించు గాక!**
**ముస్లిం సమాజమునకు అల్లాహ్ తఆలా గుణపాఠము కలిగించుగాక! అల్లాహ్ తఆలా పంపినవారి వ్యతిరేకతను వీడి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంనకు సహాయకులుగా మారుదురు గాక!**

*హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 29.12.2017 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్, మోర్డెన్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి.

అల్లాహ్ తఆలా కృపానుసారము నేడు వార్షిక సభ ఖాదియాన్ మొదలైనది. సభ మూడు రోజులు అక్కడ సురక్షితముగా జరుగుగాక! జమాఅత్ వినమ్రులు ఏ ఉద్ధేశముతో ఈ సభలో పాల్గొంటున్నారో ఆ ఉద్ధేశమును పొందువారగుదురు గాక! అల్లాహ్ తఆలా ఆస్థానములో దుఆలు చేయుట, తమ ఆచరణ స్థితులను మెరుగుపరచుకొనుటయే ఆ ఉద్ధేశము. దుఆలను తమ ఉనికి వరకే పరిమితం చేయక జమాఅత్ ప్రగతి కొరకు కూడ దుఆలు చేయవలెను. ప్రపంచములోని ఏ కోణములోనైనా జమాఅత్‌నకు నష్టము వాటిల్లుటకు జమాఅత్ వ్యతిరేకులు ప్రణాళిక రచించుచున్నచో వాటిని విఫలము చేయుటకు అల్లాహ్ తఆలా ప్రత్యేక సహాయ సహకారము కొరకు దుఆలు చేయవలెను. వారి ప్రతి కుట్ర నుండి అల్లాహ్ తఆలా రక్షించుగాక! ఇదే విధముగా ముస్లిముల సాధారణ స్థితి, అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త పేరున కొన్ని వర్గములు, ప్రభుత్వములు చేపట్టుచున్న చర్యలు, చేయుచున్న దౌర్జన్యములు, ఒక ముస్లిం మరో ముస్లిం తల నరకుచున్నాడు, ఏ విధముగానైతే రక్తపాతము సంభవించుచున్నదో, వారి కొరకు కూడ నేడు దుఆ చేయుట మన కర్తవ్యము. ఎందుకనగా వీరందరు అల్లాహ్ తఆలా, మన ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పేరున హింసకు పాల్పడుచున్నారు. ఈ హింసల వలన ముస్లిమేతరుల సమాజములో ఇస్లాం, ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంపై విమర్శలు సంధించబడుచున్నవి. ఈ విషయముల వలన అహ్మదీయులమైన మన హృదయములు కూడ గాయపడును. కనుక ఇందు కొరకు కూడ మనము దుఆ చేయవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఏ ఉద్ధేశము కొరకు పంపబడినారో అందు కొరకు కూడ దుఆలు చేయవలెను. ముస్లిముల మార్గదర్శనము, ముస్లిమేతరులకు ఇస్లాం వాస్తవమును తెలుపుట, ఇస్లాం గొప్పతనాన్ని నిరూపించి వారిని ఇస్లాం నీడ క్రిందికి తీసుకొచ్చుట, ఆంహజ్రత్ సల్లల్లాహు పతాకము నీడన తీసుకొచ్చుట, దైవ ఏకత్వమును స్థాపించుయే ఆ ఉద్ధేశము. సాధారణంగా ప్రపంచ స్థితిగతుల కొరకు కూడ దుఆ చేయగలరు. అల్లాహ్ తఆలా అందరికి తెలివి తేటలు ప్రసాదించుగాక! వినాశన గుండము నుండి తప్పించుకొనుటకు అల్లాహ్ తఅలా మానవులందరికి గుణపాఠము

కలిగించుగాక! మసీహ్ మౌవూద్‌ను విశ్వసించేవారి దుఆలు నేడు ప్రపంచానికి ఎంతో అవసరము.

ముస్లిం సమాజమునకు అల్లాహ్ తఆలా తెలివితేటలు ప్రసాదించుగాక. అల్లాహ్ తఆలా పంపిన అవతారున్ని విశ్వసించనిదే వారి మనుగడ, వారి మోక్షము సాధ్యము కాదని వారు గుర్తించుదురు గాక! క్రొత్త సంవత్సరములో వీరు ప్రవేశించినప్పుడు ఈ విషయమును అర్థము చేసుకొని ప్రవేశింతురు గాక! వారికి గుణపాఠము కలుగునట్లు అల్లాహ్ చేయుగాక! ఈ అంశము గురించి హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం కొన్ని పంక్తులను ప్రవేశపెట్టుతానని హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహ్ అనిరి.

దుఆల ఆమోదము కొరకు ఒక ప్రాథమిక సూత్రమును వివరించుచు హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. హృదయము నిష్కల్మషము కానిదే దుఆ ఆమోదించబడదు. ఏదేని ఒక ప్రాపంచిక విషయములో ఒక వ్యక్తి గురించి నీ హృదయములో కపటమున్నచో నీ దుఆ ఆమోదించబడదు. ప్రాపంచిక విషయముల వలన ఎవరితో ఎప్పుడైనా కపటము యుంచుకోకూడదు. ప్రపంచము, దాని సామాగ్రి ఏ స్థాయి కలిగినవని వాటి వలన నీవు ఒకరితో శత్రుత్వము చేయుచుందువు ?

హుజూరె అన్వర్ ఇట్లనిరి. వ్యక్తిగత కపటములు, శత్రుత్వమును మరచిపోయి, రోధించుచు అల్లాహ్ తఆలా ఆస్థానములో తమ పాపముల క్షమాపణ కోరవలెను, భవిష్యత్తులో తమ హృదయమును పవిత్రముగా యుంచుకొనుటకు అల్లాహ్ తఆలాతో సహాయము కోరుటయే దుఆల ఆమోదము కొరకు చాలా ముఖ్యము. నేడు అహ్మదియ్య జమాఅత్ వ్యతిరేకులు తమ వ్యతిరేక కార్యకలాపాల చర్యలలో చాలా దూకుడుగా యున్నారు. కనుక మనము ఏకమై దుఆలతో అల్లాహ్ తఆలా ఆస్థానములో హాజరు కావలెను. మానవుడు వ్యాకులత చెందుచు బాధపడుచు అల్లాహ్ తఆలా ఆస్థానములో మోకరిల్లినప్పుడు, అతనితో యాచించినప్పుడు అల్లాహ్ తఆలా కూడ అతని సహాకారమునకు వచ్చును. కనుక ఈ వాస్తవమును సదా గుర్తుంచుకోవలెను, ఎన్నడు ఈ విషయమును విస్మరించకూడదు.

హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

అల్లాహ్ తఆలా ఎంతో స్వయంభువుడని గుర్తుంచుకొనుము. అధికముగా పదే పదే దుఆ చేయనంత వరకు అతడు లెక్క చేయడు. ఎవరో ఒకరి సతీమణి లేదా కుఆమరుడు వ్యాధికి గురైనచో లేదా క్లిష్టమైన ఆపద ఎదురైనప్పుడు ఈ విషయముల వలన అతడెంత బాధకు గురగును. ప్రతి రకమైన బాధాకర స్థితిలో అల్లాహ్ తఆలా ఉనికి మాత్రమే ఉపయోగపడును. అతడే దుఆలను వినును, తమ దాసులకు సహాయము చేయును.

ఖాదియాన్‌లో యున్న వారిని ఉద్దేశించి నేను చెప్పుచున్నాను. ఈ రోజులలోని ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణములో హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నగరములో యుంటున్నారు, అక్కడ కొన్ని రోజులు గడుపుచున్నారు, కనుక తమ నమాజులు, తమ అదనపు నమాజులలో దుఃఖకర స్థితిని ఏర్పరచుకొనుటకు ప్రయత్నించగలరు. సాధారణంగా జమాఅత్ మొత్తం ఇటువైపు దృష్టి సారించవలెను. అనవసరపు మాటల బదులు అధిక సమయమును దుఆలు, దైవ స్మరణలో గడపవలెను. వ్యాకులత చెందుచు అల్లాహ్ తఆలా ఆస్థానములో మోకరిల్లగలరు. తద్వారా ఎక్కడెక్కడ అహ్మదీయుల కొరకు బాధాకర పరిస్థితులున్నవో అక్కడక్కడ అల్లాహ్ తఆలా పరిస్థితులను మెరుగుపరచు గాక! (ఆమీన్)

☆☆☆